## క్లుప్తంగా

### ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 43వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా విద్యార్థులు సినీ, కూచిపూడి,శాస్త్రీయ సంగీతానికి అనుగుణం ప్రదర్శించిన డ్యాన్స్‌లు తోటి విద్యార్థులను ఎంతో ఉత్సాహపర్చాయి.

### విలువిద్య పోటీల్లో సూర్యహంసినికి బంగారుపతకం



ఎం.సూర్యహంసిని

సాక్షి, భీమవరం: ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎన్‌టీపీసీ జాతీయ ర్యాంకింగ్ విలువిద్య పోటీల్లో భీమవరం భారతీయ విద్యా భవన్స్ విద్యార్థిని ఎం.సూర్యహంసిని ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచిందని కోచ్ కమల కిషోర్ శనివారం విలేకరులకు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్న సూర్య హంసినిని అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి జయరాజు అభినందించారు.

### నూతన రూరల్ ఎస్సైగా మోహన్‌రావు



మోహన్‌రావు.

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ ఎస్సైగా బండి మోహన్‌రావు శనివారం విధులకు హాజరయ్యారు. మోహన్ రావు గతంలో భీమవరం ట్రాఫిక్ ఎస్సై విధులు నిర్వహించి రూరల్ ఎస్సైగా బదిలీపై వచ్చారు. ప్రస్తుత రూరల్ ఎస్సైగా విధులు నిర్వహించిన వి.అప్పలరాజు వీఆర్‌కు వెళ్లారు. నూతన రూరల్ ఎస్సై మోహన్‌రావుకు పోలీస్ స్టేషన్‌లో పలువురు సిబ్బంది, మండల నాయకులు, వివిధ ప్రముఖులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

### పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



పెనుగొండలో పంట కాలువలోకి దూసుకుపోయిన కారు

పెనుగొండ: పెనుగొండ మార్కెట్ యార్డు వద్ద ఇన్నోవా కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకొన్నారు. శనివారం తెల్లవారు జామున తూర్పుగోదావరి జిల్లా నుంచి నరసాపురం వైపు ప్రయాణిస్తుండగా అదుపు తప్పడంతో పంట కాలువలోకి దూసుకు వెళ్లింది. కారుల్లో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

# లోక్ అదాలత్‌లో 699 కేసుల పరిష్కారం



భీమవరంలో లోక్‌అదాలత్‌లో కేసులను విచారిస్తున్న జడ్జి శ్రీసత్యాదేవి

సాక్షి, భీమవరం: పట్టణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 699 కేసులు పరిష్కరించినట్లు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి చెప్పారు. మండల న్యాయసేవాధికార ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కక్షిదారులు పంతాలకు పోకుండా కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం వృథా కాదని కక్షిదారులు, న్యాయవాదులు సహకరిస్తే త్వరితగతిన న్యాయం జరుగుతుందన్నారు. ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీరు సహకరించడం వల్ల ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. అదాలత్‌లో 61 సివిల్ కేసులు, భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు పోలీస్ స్టేషన్‌ల్లోని 105 క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు నాలుగు, చెక్ బౌన్స్ కేసులు 21, బ్యాంక్ రికవరీ కేసులు 26, ఎస్‌టీసీ కేసులు 467, బీఎస్ఎన్ఎల్ కేసులు 15 ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీ చేసినట్లు శ్రీ సత్యాదేవి వివరించారు. సివిల్, చెక్‌బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసుల్లో అవార్డులు జారీ చేశామన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లను 5 బెంచ్‌లుగా ఏర్పాటు చేయగా సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి డి.సోని, ఒకటో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎ.పవన్‌కుమార్, రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ డి.ధనరాజు, న్యాయవాదులు సీహెచ్ సూర్యనారాయణ, వి.లక్ష్మణస్వామి, ఎన్.సత్య విజ్ఞానదేవి, సీహెచ్ ఝాన్సీలక్ష్మి, వి.కరుణాకరరావు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో సుస్థిర అభివృద్ధి



రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భీమవరం నియోజకవర్గంలో సుస్థిర అవృద్ధి జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి గోదావరి జిల్లాల పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం రాత్రి భీమవరం వచ్చిన ఆయన ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి మాట్లాడారు. అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీ పడే పరిస్థితి లేదని పేర్కొన్నారు. అభివృద్ధికి చిరునామాగా పనిచేస్తూ, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు.

**శాంతి భద్రతలు పరిరక్షించాలి**

సాక్షి, భీమవరం: పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షించాలని, అదే సమయంలో ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ గా ఉండాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భీమవరం రూరల్ ఎస్సై మోహన్ రావును ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భీమవరం ట్రాఫిక్ ఎస్సైగా పనిచేసిన మోహన్ రావు ఇటీవల ఎస్సైల బదిలీలలో భాగంగా భీమవరం రూరల్ ఎస్సైగా నియమితులయ్యారు.

# మనల్ని గౌరవించేవారితో కలిసి సాగుదాం



ఉండిలో సువార్త సభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాన్సన్, విజయ్‌ప్రసాద్, పాస్టర్లు

ఉండి: మనల్ని గౌరవించి మన మంచి కోరే వారితోనే ప్రయాణం సాగిద్దామని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్రాధ్యక్షుడు, రాష్ట్ర పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేడిద జాన్సన్ అన్నారు. శనివారం ఉండి పెనూయేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఈదా విజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సువార్తికుడు బ్రదర్ అనిల్‌కుమార్ హాజరవుతున్న యేసుక్రీస్తు సువార్త మహాసభలు నిర్వహణ కార్యక్రమ పోస్టర్‌ను జాన్సన్ ఆవిష్కరించారు. ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు, భీమవరం, వీరవాసరం మండలాల నుంచి హాజరైన పాస్టర్లు, క్రైస్తవ నాయకులతో జాన్సన్ మాట్లాడుతూ పెనూయేలు ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న 18వ వార్షిక యేసుక్రీస్తు సువార్త మహాసభలకు అంతర్జాతీయ సువార్తికులు అనిల్‌కుమార్, పాస్టర్ ఎం జ్యోతిరాజు హాజరవుతున్నారని, ఈ సభలకు క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఉండి బస్టాండ్ ఎదురుగా ఎస్‌టీఆర్ ఎస్టేట్స్‌లో నిర్వహించే సభలకు హాజరైయ్యే వారికి మౌలిక సదుపాయాలు, భోజన ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులకు ఆదరణ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే లభిస్తోందన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) 13 మండలాల కన్వీనర్ ఎం శ్యాంబాబు, బిషప్ బెనర్జీ, త్మీయతల్లి దాయం సునీత, జే రాజేష్, కే డేవిడ్, జీ సూరిబాబు, బి రెడ్డి, బ్రదర్ చిట్టిబాబు, అడబాల నాని, యూత్ సభ్యులు, యూపీఎఫ్ ఆరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

# శ్రీకాకుళంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించిన ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆకివీడు: కేంద్ర ప్రభుత్వ ధోరణిని తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఒకే వేదికపైకి రావాలని భారత కార్మిక సంఘాల సమైక్య ( ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఈ నెల 25,26 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్ర ఐఎఫ్‌టీయూ మహాసభల కరపత్రాన్ని శనివారం కార్మికుల పని క్షేత్రం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కుల్ని కాలరాస్తూ, కార్పొరేషన్‌కు దాసోహం పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులు శ్రీకాకుళం వేదికగా ఉద్యమించేందుకు పిడికిలి బిగించాలని రామ్మోహన్ పిలుపు నిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఆకివీడు ఏరియా కార్యదర్శి తోట రామకృష్ణ మాట్లాడుతూ మహాసభలను జయప్రదం చేసి కార్మికుల సత్తాను చాటాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# మానవత్వం, నైతికత పెంపొందాలి



స్థానిక ముస్లిం వీధిలో జాగృతి ఉద్యమ కరపత్రాల్ని ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ సభ్యులు

ఆకివీడు: నేటి సమాజంలో మానవత్వం, నైతికత నశించిపోతున్నాయని, ప్రజల్లో మానవ సంబంధాలు పెంపొందించేందుకు జమాతే ఇస్లామి హింద్ సంస్థ జాగృతి ఉద్యమం చేపట్టిందని సంస్థ స్థానిక అధ్యక్షుడు ముహమ్మద్ షహాజాద్ చెప్పారు. స్థానిక ముస్లిం వీధిలోని మదర్సా కేంద్రంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువలు దిగజారుతున్న సమాజంలో అశాంతి, అలజడి, నేరాలు, మారణ హోమాలు అధికమయ్యాయని అయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మనిషిలో నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవతా విలువలు వికసిస్తాయన్నారు. ఈ నెల 20 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి ఉద్యమం కొనసాగుతోందన్నారు. ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, వివిధ మత గురువులతో చర్చా గోష్ఠి, కరపత్రాలు, పోస్టర్ల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు షహాజాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సయ్యద్ ఫారూఖ్, మహబూబ్ జానీ, కార్యకర్తలు ముహమ్మద్ అతీఫ్, సయ్యద్ ఆరిఫ్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

### డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్

సాక్షి, భీమవరం: భీమవరం టుటౌన్ ప్రాంతంలో ఓ ఆర్టీసీ బస్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. భీమవరం ఆర్టీసీ డిపోనకు చెందిన బస్ శనివారం తాడేపల్లిగూడెం నుంచి గణపవరం మీదుగా భీమవరం వస్తుండగా ఉండి రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అయితే ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. డ్రైవర్ వేగాన్ని అదుపు చేయకపోడం వల్లే ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు.

### లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు

సాక్షి, భీమవరం: పట్టణంలో మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తులను టిప్పర్ లారీ ఢీకొనడంతో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. పాలకొల్లు మండలం తిల్లపూడి గ్రామానికి చెందిన కుంచె వెంకటసూర్యనారాయణ తన బంధువుతో కలిసి శనివారం తెల్లవారుజామున భీమవరం నుంచి తిల్లపూడి వెళుతుండగా బుధవారం మార్కెట్‌లోని వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్లే సరికి ఆవు అడ్డురావడంతో మోటారు సైకిల్ అదుపు తప్పింది. అదే సమయంలో అటుగా వెళుతున్న లారీ ఢీకొనడంతో గాయాలై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు.

### బాకీ అడిగినందుకు దాడి

పాలకోడేరు: తన వద్ద వారం క్రితం తీసుకున్న రూ.10 వేలు అప్పును తిరిగి ఇవ్వమని అడిగితే బండి దొరబాబు అనే వ్యక్తి చేతిలో ఉన్న తాళం చేతులతో ముఖంపై కొట్టి గాయపరిచాడని వేంద్రకు చెందిన గూడూరు శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడు దొరబాబుపై కేసు నమోదు చేశామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

# పోషకాహారంతో అంధత్వ నివారణ



పెదకాపవరంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి

ఆకివీడు: పోషకాహారంతో అంధత్వ నివారణ చేపట్టవచ్చునని ఎంపీపీ కఠారి జయలక్ష్మి చెప్పారు. మండలంలోని పెదకాపవరం పీహెచ్‌సీలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పేరూరి వెంకటేశ్వర్లు, కాశీరత్నం నేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు సమస్య వస్తుందన్నారు. పోషక విలువలు తగ్గినా, పౌష్టికాహారం అందకపోయినా, విటమిన్ల లోపాలతో కంటిచూపు సమస్యలు వస్తాయన్నారు. ఈ సమస్య నుంచి విద్యార్థుల్ని కాపాడేందుకు జగనన్న గోరుముద్ద కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీపీ చెప్పారు. ప్రతీ రోజూ గుడ్డు అందజేసి విద్యార్థుల్లో ఏ విటమిన్ సమస్యను తొలగిస్తున్నారన్నారు. అంధత్వ లోపాలను కంటి వైద్యుల సలహాల మేరకు నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కాళ్లకూరురులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సాదు శ్రీదేవి

కాళ్ల: ప్రతి ఒక్కరూ విధిగా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి కాళ్లకూరు సర్పంచ్ సాదు శ్రీదేవి తెలిపారు. కాళ్లకూరులో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భీమవరం ఆదిత్య డిగ్రీ కాలేజీ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ సాధు శ్రీదేవి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ శిబిరం వద్ద ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ డి.వి కృష్ణంరాజు, దేవస్థానం ఈవో సురేష్, ఉప సర్పంచ్ ప్రదీప్ రాజు మాజీ చైర్మన్ నాగరాజు, మాజీ సర్పంచ్ ఆనందరావు, గ్రామ పెద్దలు, ప్రజలు కాలేజీ ప్రతినిధులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# తాళ్లకోడు లేఅవుట్‌కు మంచినీటి సరఫరాపై చర్చ

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల్లోని పేదల ఇళ్లకు మంచి నీటి సరఫరాపై పంచాయతీ సమావేశంలో చర్చించారు. సర్పంచ్ ముత్యాల అనురాధ అధ్యక్షతన శనివారం సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో తాళ్లకోడులోని జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మంచినీటి సరఫరాకు గ్రామంలోని చెరువు కేటాయింపుపై చర్చించారు. గ్రామంలో మల్లయ్య చెరువు, పెద, చిన్న చాకిరేవు చెరువులు, ఊర చెరువు, కొత్త చెరువు, తోలేటి కుంట, అంకోడు హరిజన పేట చెరువులున్నాయని కార్యదర్శి ఆనంద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధి, పెరుగుతున్న గ్రామ జనాభాను దృష్టిలో పెట్టుకుని నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అనురాధ సూచించారు. తొలుత గ్రామ పెద్దలు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), సంధ్యాల సీతారామయ్య, బండి కొండ, ముత్యాల శివయ్య తదితరులు సమావేశం నిర్వహించి తాళ్లకోడులో 3,600 మందికి పట్టాలు ఇచ్చినందున సుమారు 10 వేల మంది జనాభా ఉంటారని చెప్పారు. జనాభాకు సరిపడే విధంగా మంచినీటి చెరువు తవ్వాలన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఊర చెరువును స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించుకుని, సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్త చెరువు లేదా తోలేటి కుంట కేటాయించేందుకు సర్వే చేయించి, లేఅవుట్ ప్రజలకు మంచి నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తోలేటి కుంట ప్రాంత 1.70 సెంట్ల భూమిని చెరువుగా కేటాయించేందుకు పంచాయతీ తీర్మానం చేసింది. సమావేశంలో పలువురు వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ పథకాలు

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు గ్రామంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఇంటింటికీ పర్యటించారు. గడిచిన 3 ఏళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సంక్షేమపథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో? ఆయన ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వలంటరీ, సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా, పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చేకూరి సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, ఎంపీటీసీ సభ్యులు పోడూరి నాగరాజారావు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు, దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా పాల్గొన్నారు.

# చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి

కాళ్ల: ప్రభుత్వ స్థలంలో ఎన్నో ఏళ్ల నుంచి పెరిగిన చెట్లను గ్రామానికి చెందిన వ్యక్తి వ్యాపార అవసరాల కోసం నరికి వేశారంటూ కాళ్ల తహసీల్దార్ టి.ఎ.కృష్ణారావుకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేటి రంగారావు శనివారం తెలిపారు. కాళ్ల మండలం దొడ్డనపూడి రెవెన్యూ పరిధిలోని ఆర్ఎస్ నం: 526, 509 ప్రభుత్వ భూమిలోని కాలువ గట్టు పక్కన నిద్రగన్నేరు, తాడిచెట్లను అక్రమంగా మెషీన్‌తో కోసి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అమ్ముకున్నాడన్నారు. సుమారు ముప్పై ఏళ్ల పైబడి ఉన్న ఈ చెట్ల కింద చుట్టు పక్కల రైతులు సేదతీరేవారన్నారు. చెట్ల నరికివేత విషయాన్ని స్థానిక వీఆర్వో ఏడుకొండలు దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను నరికివేసిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



# అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమరా ప్రసాద్‌ను దేశద్రోహం నేరం కింద కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వై.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాలపర్తి జోనా, జంగం మాణిక్యాలరావు, మరపట్ల మునియ్య, అద్దంకి డేవిడ్, గొల్ల రాజ్‌కుమార్, గెడ్డం జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక 14వ వార్డులోని శ్రీఅభయసాయి ధ్యాన మందిరం 30వ వార్షిక మహోత్సవాలలో భాగంగా శనివారం సంప్రదాయబద్ధంగా సాయిబాబా వారికి అన్నాభిషేకం నిర్వహించారు. గుణ్ణం విశ్వేశ్వరరావు, దుర్గాభవాని దంపతులతో బాబావారికి 22 ద్రవ్యాలతో వేదమంత్రాల నడుమఅభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైభవంగా అన్నాభిషేకం చేసి బాబా వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ నిమ్మల శారదా సాయి, కార్యదర్శి అడబాల సాయిరామకుమార్, కోశాధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



### తుందుర్రులో అమ్మవార్ల జాతర ప్రారంభం

భీమవరం అర్బన్: మండలంలోని తుందుర్రు గ్రామంలో గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మారెమ్మ, మహలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర శనివారం వైభవంగా ప్రారంభించారు. ఈ నెల 17 వరకూ అమ్మవార్ల జాతర నిర్వహిస్తారు.

### పెర్కిపాలెంలో వైద్య శిబిరం

వీరవాసరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పెర్కిపాలెం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు మణిత్యాగి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలపై ఆరోగ్య సిబ్బంది తక్షణం స్పందిస్తున్నారన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో చిట్టి బాబు పాల్గొన్నారు.

### ఎస్‌ఎఫ్ఐ అధ్యక్ష,కార్యదర్శుల ఎన్నిక

సాక్షి, భీమవరం: ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం భీమవరంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పి.వాసు, డి.పెద్దిరాజు ఎన్నికైనట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### చెట్టు కూలి వ్యక్తికి గాయాలు

పెనుగొండ: మండలంలోని ములపర్రులో కొబ్బరి చెట్టు కూలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఉదయం ములపర్రు శివారు పితానివారిపాలేనికి చెందిన గుత్తుల శ్రీనివాసరావు పాలకేంద్రం నుంచి సైకిల్‌పై వస్తుండగా ఒక్కసారిగా కొబ్బరి చెట్టు విరిగి పడడంతో తలకు, నడుముకు గాయాలు అయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించడంతో తణుకు ఆసుపత్రికి తరలించారు.

### వైభవంగా పాండురంగ స్వామి వార్షికోత్సవం



కుప్పనపూడిలోని పాండురంగస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆకివీడు: పాండురంగస్వామి ఏడవ వార్షికోత్సవం శనివారం ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ప్రాంతంలో పాండురంగస్వామి ఆలయం పురాతనమైనదని, మంచినీటి చెరువుగట్టున వెలసిన స్వామికి గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయం నిర్మించినట్లు మాజీ సర్పంచ్ మోటుపల్లి రాజు చెప్పారు. అప్పటి నుంచి స్వామి కల్యాణోత్సవం, వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జరిగింది.

### జాతర నిర్వాహకులపై కేసు నమోదు

పాలకోడేరు: అనుమతి లేకుండా జాతర నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. మోగల్లులో వుంతలో మునలమ్మవారి జాతర నిర్వహించారు. దీంతో కమిటీ సభ్యులపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.